క్లుప్తంగా

పెన్ డౌన్‌తో రిజిస్ట్రేషన్ సేవలకు బ్రేక్



కదిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

కదిరి టౌన్: రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానాల్లో మార్పులు చేయాలన్న డిమాండ్‌తో డాక్యుమెంట్ రైటర్లు రెండో రోజూ శనివారం పెన్‌డౌన్ చేపట్టారు. ఈమేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన 2.0 విధానంలో చాలా లోపాలున్నాయని, వాటిని సరిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు వాసు, రమణ, జయకృష్ణ, రామ్మోహన్, జనార్దన్, పివి. రమణ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలు

గాండ్లపెంట: గొడ్డువెలగల పంచాయతీ వంక లోపల్లిలో విద్యుదాఘాతంతో రెండు గొర్రెలు మృతి చెందాయి. వివరాలు.. గ్రామానికి చెందిన శివయ్య తన గొర్రెలను దొడ్డిలో ఉంచాడు. అయితే దొడ్డిలో ఉన్న విద్యుత్ స్తంభానికి విద్యుత్ ప్రసరించడంతో రెండు గొర్రెలు మృతి చెందాయి. మరో రెండు అస్వస్థతకు గురయ్యాయి. అస్వస్థతకు గురైన గొర్రెలు కూడా కోలుకునే పరిస్థితిలో లేవని, దీంతో రూ.60 వేల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

రైతులకు యూరియా పంపిణీ



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఏఓ ఓబిరెడ్డి తదితరులు

బత్తలపల్లి: మండలంలోని మాల్యవంతం రైతులకు రైతు సేవా కేంద్రంలో శనివారం యూరియా పంపిణీ చేశారు. ఏఓ ఓబిరెడ్డి మాట్లాడుతూ రైతులు అవసరం మేరకు యూరియా తీసుకెళ్లాలన్నారు. మాల్యవంతం, ఈదుల ముష్టూరు, అప్పరాచెరువు రైతు సేవ కేంద్రాలకు ఒక్కో రైతు సేవ కేంద్రంలో 7.3 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియా నిల్వ ఉందన్నారు. మొత్తం 21.9 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది గీతాంజలి, నాగజ్యోతి, టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, రాము, రైతులు పాల్గొన్నారు.

వీఆర్ఏల డిమాండ్లు నెరవేర్చాలి



వీఆర్ఏల దీక్షకు మద్దతు తెలుపుతున్న సీపీఐ నాయకులు

ధర్మవరం రూరల్: న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణం నెరవేర్చాలని వీఆర్ఏ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన దీక్షకు సీపీఐ నాయకులు మధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తి మహేష్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఎన్నో హామీలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం వాటిని పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు



దేవతల వేషధారణలో విద్యార్థులు

ధర్మవరం: నాగలూరు వద్దనున్న రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో దసరా పండుగను పురస్కరించుకుని దసరా ఉత్సవాలను శనివారం నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు దుర్గాదేవి, మహిషాసురుడు, శ్రీరాముడు, సీత, రావణాసురుడు వేషధారణలతో అలరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ మాట్లాడుతూ దేశంలో హిందువులు జరుపుకునే అతి పెద్ద పండుగలలో దసరాకు ఎంతో విశిష్టత ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రూపరాజాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా బాబ్‌జాన్

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా బాబ్‌జాన్ ఎన్నికైనట్లు హెచ్‌ఎం ప్రసాద్ శనివారం తెలిపారు. గతంలో ఉన్న చైర్మన్ అనివార్యకారణాల వల్ల రాజీనామా చేయడంతో నూతన కమిటీ చైర్మన్ ఎన్నిక నిర్వహించామన్నారు.

వర్షపు నీరు వెళ్లేదెలా..?

- మండల కేంద్రంలో పలు కాలనీలు జలమయం
- చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తున్న వైనం
- అవస్థలు పడుతున్న కాలనీల వాసులు



యల్లమ్మ వీధిలో నిలిచిన వర్షపు నీరు

నల్లచెరువు: చిన్నపాటి వర్షం పడిందంటే చాలు మండల కేంద్రంలోని యల్లమ్మ వీధి, రైల్వే స్టేషన్ వీధులతో పాటు పలు కాలనీలు జలమయం అవుతున్నాయి. యల్లమ్మ వీధిలో అయితే వర్షం నీరు ఇళ్లలోకి చేరుతోంది. డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో వర్షం నీరు వెళ్లేందుకు సమస్యగా మారింది. వర్షం వచ్చినప్పుడల్లా ఆయా కాలనీల్లోని ఇళ్ల మధ్య నీరు నిలుస్తోందని ప్రజలు చెబుతున్నారు. వర్షపు నీటితో పాటు మురుగునీరు కలిసి ఇళ్లలోకి, ఇళ్ల మధ్యలోకి చేరడంతో కాలనీలు దుర్వాసన వెదజల్లుతున్నాయని వాపోతున్నారు. ఇక భారీ వర్షం పడితే పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డ్రెయినేజీలు లేవు



మా వీధిలో డ్రెయినేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షపునీరు ఇళ్లలోకి చేరుతోంది. దీనికి తోడు వర్షం నీటిలో మురుగు నీరు చేరి వీధి మొత్తం దుర్వాసన వస్తోంది. దీంతో చిన్నారులు, వృద్ధులు వ్యాధుల బారిన పడుతున్నారు. కాలువను నిర్మించి సమస్యను పరిష్కరించాలి.
– టి.భారతి, యల్లమ్మ వీధి, నల్లచెరువు

పరిశీలనే.. పరిష్కారం లేదు



యల్లమ్మ వీధిలోని సమస్యలపై అధికారులు ఎన్నో సార్లు విన్నవించుకున్నాం. ప్రతిసారీ పరిశీలిస్తున్నారు తప్ప పరిష్కారం మాత్రం చూపడంలేదు. కాలువలు లేకపోవడంతో వర్షం పడినపుడు ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి మాది. వర్షం నీరు ఇళ్లలోకి చేరకుండా శాశ్వత పరిష్కారం చూపాలి.
– ఇందిరమ్మ, యల్లమ్మ వీధి, నల్లచెరువు

డ్రెయినేజీల నిర్మాణానికి కృషి



వర్షం కురిసినప్పుడు వీధుల్లోకి నీరు చేరుతోంది. పంచాయతీ అధికారులు, పారిశుధ్య కార్మికులు అందుబాటులో ఉండి కాలనీవాసులకు అసౌకర్యం లేకుండా చూస్తున్నాం. యల్లమ్మ వీధిలో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే డ్రెయినేజీల నిర్మాణానికి కృషి చేస్తాం.
– నరేష్ కుమార్, పంచాయితీ కార్యదర్శి, నల్లచెరువు

రెండో రోజూ దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రెండోరోజు నిరసన తెలుపుతున్న దస్తావేజు లేఖరులు

ధర్మవరం: రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాలతో సమస్యలు వస్తున్నాయని దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండార్ల అసోసియేషన్ సభ్యులు తెలిపారు. శనివారం స్థానిక సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం వద్ద రెండోరోజు దస్తావేజు లేఖరులు నిరసన తెలిపారు. నూతన విధానాలతో ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటా బేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్లు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన కార్డు ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాలతో దస్తావేజు తయారీ అనేది సమస్యగా మారిందన్నారు. ప్రజలు, దస్తావేజు లేఖరుల విలువైన సమయాన్ని వృథా చేసుకోవాల్సి వస్తోందన్నారు. నిరసనలో దస్తావేజు లేఖరుల అసోసియేషన్ అధ్యక్షుడు జావీద్, ఉపాధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి మహేంద్ర, జాయింట్ కార్యదర్శి నాగార్జున, కోశాధికారి మల్లికార్జున, దస్తావేజు లేఖరులు బాలాజి, వాజీద్, గోపి, సుధాకర్, కీర్తి, సదాశివ, అనిల్, పామిశెట్టి మల్లికార్జున, సహాయకులు పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుడిపై దాడి హేయం



ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఈశ్వరయ్యకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరం: సీఐటీయూ నాయకుడిపై దాడి చేయడం హేయమైన చర్య అని సీపీఎం, సీఐటీయూ నాయకులు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఈశ్వరయ్యకు వినతిపత్రం అందించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్‌హెచ్ బాషా, సీఐటీయూ మండల కోకన్వీనర్ అయూబ్‌ఖాన్ మాట్లాడారు. బుక్కపట్నంలోని వెలుగు కార్యాలయం వద్ద ఈనెల 16న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్‌పై దాడికి పాల్పడిన సీసీ రవీంద్రను సస్పెండ్ చేయాలి, అతనితోపాటు బుక్ కీపర్ నాగరాజు, మరికొందరిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. డ్వాక్రా మహిళలకు సంబంధించి దాదాపు రూ.8 లక్షలు అవినీతి జరిగిందని ఈ విషయమై గ్రూపులోని సభ్యులు సీఐటీయూ నాయకునికి తెలియజేయగా, వెలుగు కార్యాలయానికి వెళ్లిన సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌పై సీసీ రవీంద్ర, బుక్ కీపర్ నాగరాజు, మరికొందరు దాడికి పాల్పడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆదినారాయణ, హైదర్‌వలి, చేనేత కార్మిక సంఘం నాయకులు వెంకటస్వామి, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

‘హామీల అమలుకు ఎన్నిరోజులు ఎదురుచూడాలి?’



ఎన్‌పీకుంటలో ఐక్యత చాటుతున్న ఉపాధ్యాయులు

ఎన్‌పీకుంట: కూటమి ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల అమలుకు ఎన్ని రోజులు ఎదురుచూడాలని ఫ్యాప్టో చైర్మన్ జి.హరిప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం చలో విజయవాడ కార్యక్రమ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ తమ డిమాండ్ల సాధన కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో అక్టోబర్ 7న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించి తమ డిమాండ్లను పరిష్కరించాలని లేని పక్షంలో ఐక్య ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జవహర్, నాయకులు రామాంజనేయులు, వీరమహేశ్వర, శివయ్య, వెంకటరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సందీప్, ధనుంజయ్ రెడ్డి, రామ్మోహన్, పూర్ణానంద, ఖాసీంసాహెబ్, బాబావలి, కెజీబీవి ఎస్ఓ రిహానా, ఆయేషా, జ్యోతి, వరలక్ష్మి, సాయిలీల తదితరులు పాల్గొన్నారు.

తలుపుల: ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 7న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. ఈమేరకు శనివారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమానికి ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో కో చైర్మన్ సమీవుల్లా, బాబాపక్రొద్దీన్, మహబుబ్‌బాషా, ఇస్మాయిల్, ప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, దివాకర్, కిరణ్‌కుమార్ గౌడ్, దామోదర్‌రెడ్డి, సావిత్రి, రమణానాయక్, రాజారమేష్, యోగేశ్వర్ నాయుడు, రామచంద్ర, గంగరాజు, కపిరేజ్, మహేశ్వరి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

25న రణభేరి విజయవంతం చేయండి



అమడగూరులో రణభేరి పోస్టర్లను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



పోస్టర్లను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఓడీచెరువు (అమడగూరు): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న గుంటూరులో నిర్వహించే రణభేరి భారీ ర్యాలీ, బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను మధ్యాహ్న భోజన విరామ సమయంలోఅమడగూరు ఉన్నత పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు ఖాజాపీర్, ప్రధానోపాధ్యాయుడు రమణారెడ్డి ఆధ్వర్యంలో విడుదల జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ ఐదు బృందాలుగా రణభేరి కార్యక్రమాన్ని చేపట్టామని, ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాలేదన్నారు. దీంతో ఈ నెల 25వన గుంటూరులో రాష్ట్ర స్థాయి రణభేరి కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమేష్, ఉమాపతి, ఆజం, ఖాజావలి, నిర్మల, సునీత, ప్రత్యూష, సూర్యనారాయణరెడ్డి, లక్ష్మీపతి, వేమనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: ఈ నెల 25న గుంటూరులో జరిగే రణభేరికార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ నాయకులు శనివారం కోరారు. గాండ్లపెంట, కటారుపల్లి, రెక్కమాను పాఠశాలల్లో రణభేరి పోస్టర్‌ను యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చెన్నూరు తాహెర్‌వలీ, జిల్లా ఆడిట్ సభ్యుడు మల్లికార్జున విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు బోధనేతన యాప్‌లను రద్దు చేయాలన్నారు. 12వ పీఆర్‌సీ నియమించాలని, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరులో జరిగే రణభేరి కార్యక్రమానికి ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు రమణానాయక్, ఖాదర్‌బాషా, లక్ష్మీప్రసాద్, రామసుబ్బయ్య, నారాయణరెడ్డి, నాగరాజునాయక్, పామిడి ముంతాజ్‌అలీ, మురాద్ షావలీ, చిన్నప్పయ్య, హరి, వివేకానందరెడ్డి, రాజశేఖర్, రాజారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గురజాడ అప్పారావును ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న టూ టౌన్ సీఐ రెడ్డప్ప

ధర్మవరం అర్బన్: గురజాడ అప్పారావును విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. శనివారం పట్టణంలోని శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో కవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 163వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. టూ టౌన్ సీఐ రెడ్డప్ప, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, విశ్రాంత లెక్చరర్ కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ హర్ష, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున హాజరయ్యారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ రమేష్, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు అమన్, కార్యదర్శి శ్రీనాథ్, నాయకులు బాలాజీ, అఖిల్, ఇమాన్యుయేల్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


7న విజయవాడలో మహాధర్నా



చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఓడీచెరువు: రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు అక్టోబర్ 7న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కొండకమర్ల ఉన్నత పాఠశాలలో విడుదల చేసినట్లు సత్యసాయి జిల్లా ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ గౌస్ లాజమ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యచరణ ఆవశ్యకతను వివరించారు. ముఖ్యంగా పీఆర్సీ కమిషన్ నియయమించాలని, మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, పెండింగ్‌లో వున్న 4 డీఏలు, సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని 20 డిమాండ్ల సాధన కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోమశేఖర్ నాయక్, వెంకట చలమయ్య, ఎస్‌సి నరసింహులు, చిరంజీవి, నాగరాజు, అతావుల్లా, భార్గవ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అన్ని రకాల వైద్య సేవలు



పుట్టపర్తి మండలం పెద్దతండాలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: మహిళలకు వైద్య సేవలు అందించడానికి పుట్టపర్తి మండలం పెడపల్లి తండాలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలు అందించారు. మహిళలకు బీపీ, షుగర్, నోటి క్యాన్సర్, అసంక్రమిత వ్యాధులను పరీక్షించారు. అవసరమైన మందులు అందజేశారు. పీఎంజేఏవై కార్డులు నమోదు చేశారు. పోషకాహార స్టాల్ ఏర్పాటు చేశారు. సుమారు 152 మందికి వైద్య సేవలు అందించారు. డాక్టర్ మునిచంద్రిక, సీహెచ్ఓ శివరాం, సూపర్‌వైజర్ లు చంద్రకళ, వెంకటరమణ, ఎంఎల్‌హెచ్ పీలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: మండెంవారిపల్లి గ్రామంలో శనివారం స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ బాలాజీనాయక్ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సీహెచ్ఓ నాగలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కదిరిలో మానవహారం ఏర్పాటు చేసిన జెడ్పీహైస్కూల్ విద్యార్థినులు



మడకశిర పోలీస్ స్టేషన్ ఆవరణలో శుభ్రం చేస్తున్న సిబ్బంది



పుట్టపర్తి: కోర్టు ఆవరణలో మొక్క నాటిన జడ్జి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

పుట్టపర్తి అర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్రజలు విరివిగా మొక్కలు నాటాలని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ పిలుపునిచ్చారు. శనివారం వనమహోత్సవంలో భాగంగా కోర్టు ఆవరణలో ఆర్డీఓ సువర్ణతో కలిసి జడ్జి మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు అథావూర్ రెహమాన్, లెక్కల యదుభూషణ, ఇందిర, సూపరింటెండెంట్ బాలాజీ నాయక్, క్లర్క్ మంజునాథ్ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ముదిగుబ్బ జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి అధికారులు శనివారం మొక్కలు నాటారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీడీఓ జనార్దన్‌రావు హాజరై మొక్కలు నాటారు.కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణస్వామి, ఎంఈఓ రమణప్ప, ఏపీఎం హేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు పేర్కొన్నారు. అధికారులు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఎంపీడీఓ పోలప్ప, కార్యక్రమంలో ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబుల్‌రెడ్డి, హెచ్‌ఎం వెంకటాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక ఎస్టీఎస్ఎన్‌ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మితతో పాటు అధ్యాపకులు, నిజాంవలీకాలనీలోని మున్సిపల్ పాఠశాలలో బీజేపీ నేతలు పీట్ల రమణమ్మ, రామక్రిష్ణ, హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ఎన్‌పీకుంట: స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేసి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ భారత్ డైరెక్టర్ పర్వీన్‌బాను, డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు, విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. తహసీల్దార్ బాబురావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సునీత, ఎంఈఓ కృష్ణానాయక్, హెచ్‌ఎం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తలుపుల: బట్రేపల్లి నగరవనంలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అటవీక్షేత్రాధికారి గుర్రప్ప మొక్కలు నాటారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డీఎఫ్ఓ ప్రదీప్‌కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు రామచంద్రారెడ్డి, దామోదర్,బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ఎంపీడీఓ పోలప్ప, తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఏఎస్ఐ గుర్రప్ప పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

పుట్టపర్తి టౌన్: ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్లు, పరిసరాలలో ఉన్న పిచ్చిమొక్కలు. చెత్త చెదారం తొలగించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌డీఓ వెంకట రత్నం అన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, అధికారులు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథగుప్త, ఏఓ రామకృష్ణ, ఎంఈఓ తిరుపాల్ నాయక్, హెచ్‌ఎం విజయలక్ష్మి, సర్పంచ్ పంచరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



ముదిగుబ్బలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నందిని



మొక్కలు నాటి నీరు పోస్తున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నందిని

ధర్మవరం అర్బన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి నందిని తెలిపారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ నేతృత్వంలో జడ్జి నందిని మొక్కలు నాటి నీరు పోశారు. న్యాయమూర్తి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడేందుకు అందరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డీఎస్ఎన్ మూర్తి, న్యాయవాదులు బాబా, బిల్లే రవీంద్ర, భాస్కర్‌గౌడ్, సుబ్బరాయుడు, కోర్టు సిబ్బంది, ఫారెస్టు అధికారులు వెంకటరమణ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం

పుట్టపర్తి టౌన్: సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని చెన్నై శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో పుట్టపర్తిలో ఈ నెల 12న నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం శనివారం ముగించారు. నిర్వాహకులు మాట్లాడుతూ శిబిరంలో 620 మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. శంకర్ నేత్రాలయం ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి, కేశాపురం సర్పంచ్ నరేంద్రరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

కనగానపల్లి: ఖరీఫ్‌లో పంటలు సాగుచేసిన రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో పంటలు నమోదు చేయించుకోవాలని ఏఓ మాధురి సూచించారు. శనివారం ఆమె స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులతో మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకూ 40 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయ్యిందని, మిగిలిన రైతులు స్థానిక ఆర్ఎస్‌కే సిబ్బందిని కలిసి పంటలు నమోదు చేయించుకోవాలన్నారు.

‘నిందితులపై చర్యలు తీసుకోవాలి’

నల్లమాడ: సీఐటీయూ జిల్లా నాయకుడు వెంకటేష్‌పై దాడిచేసిన వెలుగు సీసీ రవీంద్ర, నాగరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి గోవిందు శనివారం తహసీల్దార్ రంగనాయకులుకు వినతిపత్రం అందించారు. ఆయన మట్లాడుతూ బుక్కపట్నం మండలంలో మహిళా పొదుపు సంఘంలో చోటు చేసుకున్న అవినీతిని ప్రశ్నించినందుకు వెంకటేష్‌పై దాడి చేయడం తగదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో గంగులప్ప, మాధవరెడ్డి, కేశవరెడ్డి ఉన్నారు.

23న కౌన్సిల్ సమావేశం

కదిరి: మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఈ నెల 23న కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ కె.ఎస్.దిల్షాదున్నీసా శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

దోమల నివారణకు మందు పిచికారీ

ముదిగుబ్బ: ముదిగుబ్బలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అబేట్ మందును పిచికారీ చేయించారు. శనివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో డ్రైనేజీ నీరు నిల్వ ఉండడంతో పిచ్చిమొక్కలు పెరిగి లార్వా, దోమల ఉత్పత్తికి కారణమయ్యిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఏలు సనావుల్లా, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.


దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కదిరి టౌన్: సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఈఎస్ వెంకటేష్‌పై దాడి చేసిన వెలుగు సీసీ రవీంద్ర, బుక్ కీపర్, టీడీపీ నేత నాగరాజును అరెస్టు చేయాలని సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ఈనెల 16న బుక్కపట్నం మండలానికి సంబంధించి సంతోషమాత గ్రూపులో రూ.8 లక్షలు అవినీతి జరిగిందని వెలుగు కార్యాలయంలో ఫిర్యాదు చేసి వస్తున్న వెంకటేష్‌పై సీసీ రవీంద్ర, టీడీపీ నాయకుడు నాగరాజు దాడి చేశారు. కాని ఇంతవరకు ఏ ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదన్నారు. అనంతరం సీఎస్‌డీటీ రవిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, సాంబశివ, శాంతిబాయి, కృష్ణనాయక్, సుధాకర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ‘పోషణ్ మహ’

పుట్టపర్తి అర్బన్: మండలంలోని కొట్లపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ మహ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం , ఆకు కూరలు, కూరగాయలు ప్రదర్శించారు. సీడీపీఓ జయంతి, సూపర్‌వైజర్లు సుజాత, రజిత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గంగాధర్ తదితరులు సందర్శించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తెలుసుకోవాలన్నారు. చిన్నారులకు సీజనల్ వ్యాధులు రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం అమ్మ పేరుతో ఒక మొక్క నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, సౌభాగ్య, వెంకటనారాయణమ్మ, లక్ష్మీనరసమ్మ, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

సారూ..తీరు మార్చుకోరూ..!



మధ్యాహ్నం 2 గంటలయినా తెరుచుకోని బత్తలపల్లి గ్రామ సచివాలయం-2

బత్తలపల్లి: సచివాలయాల ద్వారానే ప్రజలకు అన్ని సేవలూ అందుతున్నాయి. అయితే అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించకపోవడం, అందుబాటులో లేకపోవడంతో వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బత్తలపల్లిలోని సచివాలయం-2 తలుపులు శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు తెరవలేదు. శనివారం కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు అధికారుల కోసం ఎదురుచూసి నిరాశతో వెనుదిరిగారు. విధుల నిమిత్తం బయట ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగులు తప్పనిసరిగా మూమెంట్ రిజిష్టర్‌లో నమోదు చేసి వెళ్లాలి. అయితే ఇవేమీ పాటించకుండా వెళ్తున్నట్లు తెలుస్తోంది. కొందరు ఉద్యోగులు సర్వేల నిమిత్తం వెళ్తుండగా, మరికొందరు ఇదే సాకుగా చూపి విధులకు ఎగనామం పెడుతున్నారు. దీంతో సచివాలయాల్లో అందుబాటులో ఉన్న ఒకరిద్దరు ఉద్యోగులు కూడా తోటి ఉద్యోగులు ఎక్కడికి వెళ్లారో ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ఎంపీడీఓ నరసింహనాయుడును అడిగేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు. అధికారుల వాట్సాప్ గ్రూపులో మెసేజ్ చేసినా స్పందన లేదు. ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ శ్రీనివాసులు మాత్రం పోట్లమర్రిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేసేందుకు అసిస్టెంట్ ఎనిమల్ బెండరీ వెళ్లినట్లు వివరణ ఇచ్చారు.